


సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
నేటి సందేశం కాదు రేపటి పొద్దు జాడ 20 YEARS ANNIVERSARY
https://www.satyamdaily.net/
శనివారం 19-7-2025
సంపుటి: 21 సంచిక: 100
పేజీలు: 8 వెల: రూ.1

## అదొక హత్యాత్పరిణామం..!



- ఆ హత్య వెనుక పథకం లేదు..రాజకీయ కోణమే లేదు!
- భార్యాభర్తల గొడవ నేపథ్యంలోనే జరిగిన ఘటన
- గొడవకు వచ్చి ఆవేశంలో కొట్టడంతో చనిపోయాడు
- అదుపులో ఎనిమిది మంది నిందితులు
- విలేకరుల సమావేశంలో ఏఎస్పీ రమణ, డీఎస్పీ వివేకానంద

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

జిల్లాలో కలకలం సృష్టించిన ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేటకు చెందిన వైకాపా నాయకుడు సత్తారు గోపి(41) హత్యోదంతంలో రాజకీయ కోణం లేదని ఏఎస్పీ కె.వి.రమణ, డీఎస్పీ వివేకానంద స్పష్టం చేశారు. ఎచ్చెర్ల మండలం కొయిరాల వద్ద ఈ నెల 11న ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతున్న సత్తారు గోపీ హత్యకు గురైన విషయం తెలిసిందే. అయితే ఇది పథకం ప్రకారం జరిగిన హత్యని ఏఎస్పీ, డీఎస్పీ వివరించారు. ఈ కేసులో అరెస్టు చేసిన ఎనిమిది నిందితులను శనివారం జిల్లా పోలీసుకార్యాలయంలో మీడియా ముందుకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫరీద్‌పేటకు చెందిన దంపతులు జి.ఉమా మహేశ్వరరావు, భవానీల మధ్య తలెత్తిన వివాదం చివరికి హత్యకు దారి తీసిందన్నారు. వివాదంపై భవానీ ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి వద్ద పంచాయితీ పెట్టిందన్నారు. అక్కడ చేసిన సెటిల్‌మెంట్ నచ్చకపోవడంతో మళ్లీ టీడీపీ నాయకుడు కొత్తకోట అమ్మినాయుడిని ఆశ్రయించారని తెలిపారు. ఆ తర్వాత తన భర్త ఉమా మహేశ్వరరావుపై భవానీ ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు కౌన్సెలింగ్‌కు రావాలని మూడుసార్లు నోటీసులు పంపినా ఉమామహేశ్వరరావు స్పందించలేదని వివరించారు. ఈ తరుణంలో అమ్మినాయుడు వర్గానికి చెందిన ఎనిమిది మందితో కలిసి ఉమామహేశ్వరరావు ఇంటికి వెళ్లిన భవానీ తలుపులు బద్దలుగొట్టి సామాన్లను వ్యానులో తీసుకుపోయి కొయిరాల జంక్షన్‌లోని ఒక ఇంట్లో పెట్టారని చెప్పారు. దాంతో రంగంలోకి దిగిన సత్తారు గోపి అక్కడికి వెళ్లి ఇంటి తలుపులు పగులగొట్టి దౌర్జన్యంగా - మిగతా చివరి పేజీలో





## నాడు ఆమెపైకి నెపం..
# మరి ఇప్పుడెవరిది ఈ పాపం!




- ఆర్ట్స్ కళాశాల గత ప్రిన్సిపాల్‌పై అధ్యాపకుల దుష్ప్రచారం
- మూల్యాంకనానికి వెళ్లకుండా అడ్డుకున్నారని ఫిర్యాదులు
- మొన్న బహిష్కరిస్తున్నట్లు యూనియన్ల మోమొరాండం
- సెకండ్ సెమిస్టర్ పక్క సెంటర్‌కు వెళ్లిపోయింది
- గతంలోనూ ఈ డిమాండ్లే ఉన్నా.. సురేఖను బలిపశువు చేశారు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

'స్థానిక యూనివర్సిటీ అధికారులు మాకు సెమిస్టర్-1, 3 మూల్యాంకనంలో పాల్గొనాలని ఆదేశించగా.. అప్పుడు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్న చిన్నారావును అడిగాం. ఆయన సెలవులో ఉన్న ప్రిన్సిపాల్ సురేఖ గారికి ఫోన్ చేశారు. మూల్యాంకనానికి ఎవరూ వెళ్లాల్సిన అవసరం లేదని, అలా వెళ్తే ఇక్కడ పాఠాలు యూనివర్సిటీవారు వచ్చి చెబుతారా? అని ప్రశ్నించారు. ఈ విషయంపై తాను కమిషనర్‌కు చెప్పుకుంటానని, ఎవరూ స్పాట్ వాల్యుయేషన్‌కు వెళ్లడానికి వీల్లేదని ఆమె గద్దించారు. ఆ తర్వాత తామంతా మూల్యాంకనానికి వెళ్తామని, రిలీవ్ చేయమని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్న ఫిజికల్ డైరెక్టర్ - మిగతా లోపలి పేజీలో


Respected Sir,

We, the undersigned faculty members, wish to bring to your kind notice that we have collectively resolved not to participate in the Spot Valuation work of II and IV Semesters until the following long-pending and repeatedly represented issues are appropriately addressed. These matters have been raised multiple times by the GCTA and GCGTA Unions before the authorities of Dr. B.R. Ambedkar University (Dr. BRAU), but no concrete action has been taken thus far.

The issues are as follows:

1. Enhancement of remuneration for Chief Examiners and Assistant Examiners involved in Spot Valuation. As previously represented, the remuneration per paper should be increased from Rs. 15 to Rs. 20.
2. Payment of Dearness Allowance (DA) for all the days during which Spot Valuation duties are carried out.
3. Enhancement of local conveyance allowance for External Examiners involved in practical examinations and Spot Valuation.
4. Increase in remuneration for invigilation duties from Rs. 150 to Rs. 200.
5. Delay in payment of remuneration for Spot Valuation and practical examinations — some payments have been pending for years. Additionally, payments for revaluation and special drives remain unpaid. In several cases, bills were misplaced by the University and faculty were instructed to resubmit them. Such negligence is unjust and unacceptable.
6. Reintroduction of the appointment of Observers to ensure the fair and smooth conduct of examinations.
7. Evaluation of long-term internships should be carried out by External Examiners, in line with APSCHE norms, instead of being handled solely by internal faculty.

Despite repeated representations, there has been no response or action from the University authorities. In view of this continued negligence, we are compelled to abstain from participating in any Spot Valuation work until all the above issues are resolved satisfactorily.

We request you to kindly take note of our decision and forward this communication to the concerned University authorities at the earliest.

Thanking you, Sir.

Yours faithfully,





ఒక ప్రాంతం.. అదీ మారుమూల గ్రామం అభివృద్ధి చెందాలంటే .. అక్కడి ప్రజలకు అక్షర జ్ఞానం అబ్బాలి. అందుకు తగిన సౌకర్యాలు సమకూరాలి. అప్పుడు ప్రజలు విద్యావంతులవుతారు. వివేచనతో మంచీచెడు ఆలోచిస్తారు. వ్యక్తిగతంగా, సామాజికంగా, రాజకీయంగా తాము ఎదగడంతోపాటు గ్రామాన్నీ ఉన్నతస్థాయికి తీసుకెళ్లగలుగుతారు. కానీ దానికి ఎక్కడో ఒకచోట బీజం పడాలి. అందుకు ఎవరో ఒకరు పూనుకోవాలి. ముందడుగు వేయాలి. అలా ముందడుగు వేసి తన స్వగ్రామమైన మందరాడలో అక్షరాలయాన్ని నిర్మించి.. వేలమందికి విద్యావెలుగులు పంచిన మహానుభావుడు వావిలపల్లి వేణుగోపాలనాయుడు (వేణునాయుడు). ఆయన నాటిన విద్యా విత్తనమే కాలక్రమంలో మొక్కగా.. చెట్టుగా.. మహావృక్షంగా ఎదిగి.. 65 ఏళ్లు గడిచినా కూడా ఇప్పటికీ తన నీడన ఇప్పటికీ వందలాదిమందికి అక్షరజ్ఞానం కల్పిస్తూ.. వారి వికాసానికి బాటలు వేస్తోంది.

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

- వేణుగోపాలనాయుడు కృషితో మందరాడకు పాఠశాల
- ఆస్తులు, శ్రమ ధారబోసి దాన్ని నిలబెట్టిన మహనీయుడు
- చుట్టుపక్కల 20 గ్రామాలకు అక్షరాలయంగా అభివృద్ధి
- పాఠశాల కీర్తిపతాకను విశ్వ వీధిలో ఎగరేస్తున్న పూర్వ విద్యార్థులు





## 65 ఏళ్ల విద్యా సుగంధం..
# వావిలపల్లి శ్రమసౌధం!



ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండల పరిధిలోని మందరాడ ఒకప్పుడు ఎటువంటి సౌకర్యాలు లేని కుగ్రామం. ముఖ్యంగా విద్యా వసతులు లేకపోవడం, పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పించాలన్న అవగాహన లేని నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల కారణంగా చిన్నపిల్లలు అక్షర జ్ఞానానికి నోచుకోలేకపోయేవారు. ఈ దుస్థితిని చూసి ఆవేదనకు గురైన గ్రామానికి చెందిన వావిలపల్లి వేణుగోపాలనాయుడు తన జన్మభూమిని దశ దిశను మార్చాలని కంకణం కట్టుకున్నారు. విద్యా సౌకర్యం అందుబాటులోకి తెస్తే సమస్యలన్నీ క్రమంగా పరిష్కారమవుతాయని భావించిన ఆయన అందుకు కృషి ప్రారంభించారు. మందరాడ గ్రామ సర్పంచ్‌గా 1959లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన తన అధికారాన్ని గ్రామాభివృద్ధికి, ప్రజాశ్రేయస్సుకు అంకితం చేశారు. ఉన్నతస్థాయి నాయకులు, అధికారులను కలిసి తమ గ్రామానికి పాఠశాల మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేయడం ప్రారంభించారు. అప్పట్లో జిల్లాపరిషత్ అధ్యక్షులుగా ఉన్న బెండి కూర్మన్న, గొర్లె శ్రీరాములునాయుడుల సహకారంతో మందరాడకు 1960లో పాఠశాల మంజూరు చేయించారు. పాఠశాల అభివృద్ధికి తన ఆస్తిని, పదవిని, పలుకుబడిని, శ్రమను వెచ్చించారు. పాఠశాలకు తమ కుటుంబ భూములను విరాళంగా ఇవ్వడంతోపాటు భవన నిర్మాణాలకు స్థానిక ప్రజల సహకారం తీసుకున్నారు. ఆ రోజుల్లో గడ్డితో షెడ్లు నిర్మించి పాఠశాలకు వసతి కల్పించారు.

### ఊరూరా తిరిగి విద్యార్థుల సమీకరణ

అప్పట్లో తమ పిల్లలను చదివించడానికి పెద్దవారు ఆసక్తి చూపేవారు కాదు. పశువుల కాపర్లుగా మార్చడం, చిన్న చిన్న పను లకు పంపడం చేసేవారు. దానివల్ల కుటుంబానికి ఆదాయం లభి స్తుందని భావించేవారు. మందరాడలో పాఠశాల ఏర్పాటైనా ఇవే కారణాలతో విద్యార్థులు వచ్చే పరిస్థితి కనిపించలేదు. దాంతో మళ్లీ వేణుగోపాలనాయుడే నడుం కట్టి ఊరూరా తిరుగుతూ పెద్దలను ఒప్పించి వారి పిల్లలను పాఠశాలలో చేర్చేలా ఒప్పించేందుకు తీవ్రంగా శ్రమించి విజయం సాధించారు. అలాగే విద్యా సంపన్నులు, బోధనే జీవన విధానంగా చేసుకున్న ఆదర్శ ఉపాధ్యాయులు వివరాలు సేకరించి వారిని తమ గ్రామ పాఠశాలకు నియమించుకోవడానికి కృషి చేశారు. ఆయన కృషి ఫలించి క్రమంగా విద్యార్థులు రావడం పెరిగింది. మందరాడతోపాటు చుట్టుపక్కల 20 గ్రామాల నుంచి విద్యార్థులు ఈ పాఠశాలకు వచ్చి చదువుకోవడం మొదలైంది.

### ఎందరో మహానుభావులు

గ్రామానికి పాఠశాలను తీసుకురావడంలో, దాన్ని తీర్చిదిద్దడంలో వావిలపల్లి వేణుగోపాలనాయుడు కృషి ఒక ఎత్తు అయితే.. పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించడానికి తర్వాత కాలంలో పలువురు మహానుభావులు చేసిన కృషి మరో ఎత్తు. నాటి మందరాడ మనసబు వావిలపల్లి చిరంజీవినాయుడు, కాకరాపల్లి సర్పంచ్ బండారు రామినాయుడు, చిన్నయ్యపేట సర్పంచ్ రూపిటి జగన్నాథనాయుడు, చింతలపేట గ్రామ పెద్ద పొట్నూరు వెంకునాయుడు, చిత్తారపురం సర్పంచ్ మొయ్యి సత్యనారాయణ నాయుడితోపాటు అక్కరాపల్లి గ్రామ పెద్దలు చేదోడుగా నిలిచి పాఠశాల ఉన్నతికి సహకరించారు. తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేసిన గెడ్డాపు సత్యం మాస్టారు ఈ పాంశాల అభివృద్ధికి సర్వశక్తులు ఒడ్డి కృషి చేశారు. 2009లో వావిలపల్లి వేణుగోపాలనాయుడు మృతి చెందగా.. అప్పటి జిల్లాపరిషత్ ఛైర్మన్ పాలవలస రాజశేఖరం అనుమతి ఇవ్వగా.. ఉన్నత పాఠశాల ఆవరణలో వావిలపల్లి విగ్రహాన్ని ఆయన కుటుంబసభ్యులు ప్రతిష్ఠించారు.

### ఉన్నత స్థానాల్లో విద్యార్థులు

మందరాడలో ఉన్నత పాఠశాల ప్రారంభించిన ముహూర్త బలమో లేక దాన్ని ప్రారంభించినవారి హస్తవాసో తెలియదు గానీ.. ఈ పాఠశాలలో విద్యార్థులు వివిధ రంగాల్లో రాణిస్తూ పాఠశాలకు పేరుప్రఖ్యాతులు తీసుకొస్తున్నారు. మందరాడ పాఠశాలలో చదువుకుంటే జీవితంలో మంచిస్థితికి ఎదుగుతారన్న భావన ప్రజల్లో నాటకుపోయిందనడం అతిశయోక్తి కాదు. అందుకే ఈ పాఠశాలలో అడ్మిషన్లకు తీవ్రపోటీ ఉంటుంది. పదోతరగతిలో ప్రతిఏటా 95



శాతానికిపైగా ఉత్తీర్ణత సాధిస్తోంది. ప్రైవేటు పాఠశాలల పోటీని తట్టుకొని ప్రస్తుతం 372మంది విద్యార్థులతో నడుస్తోంది. క్రీడారంగంలోనూ ఈ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. ఈ పాఠశాలలో చదువుకున్న జి.గీతాంజలి అంతర్జాతీయ బోట్ రోయింగ్ క్రీడాకారిణిగా రాణిస్తుండగా ముగడ శిరీష జాతీయస్థాయి స్విమ్మింగ్ క్రీడాకారిణిగా ఉంది. మరోవైపు చాలామంది పూర్వ విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నతస్థాయి అధికారులుగా, శాస్త్రవేత్తలుగా పేరుప్రఖ్యాతులు సాధిస్తున్నారు.

● ఎడిటోరియల్

# ఎమ్మెల్యేలపై పెరుగుతున్న వ్యతిరేకత!

రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వంపై అప్పుడే ప్రజల్లో వ్యతిరేకత, అసంతృప్తి పెరుగుతున్నాయా? అంటే.. ఇటీవల నిర్వహించిన పలు సర్వేలు అవునని అంటున్నాయి. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కూటమి కట్టి ఉమ్మడి ప్రత్యర్థి అయిన అప్పటి అధికార పార్టీ వైకాపాను మట్టికరిపించాయి. రికార్డు స్థాయిలో 164 సీట్లు కైవసం చేసుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఇప్పుడు ఏడాది గడిచిపోయింది. ఈ కాలంలో ఎన్నో విజయాలు సాధించామంటూ 'సుపరి పాలనలో తొలి అడుగు' పేరుతో ప్రభుత్వపరంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు చంద్రబాబు సర్కారు ఏడాది పాలనపై పలు సర్వే సంస్థలతో పాటు టీడీపీ తరఫున రాబిన్‌సింగ్ బృందం కూడా ప్రజాప్రాయ సేకరణ జరిపింది. గత ఎన్నికల ఫలితాలను కచ్చితంగా అంచనా వేయగలిగిన కేకే సంస్థతో పాటు రాబిన్ సింగ్ బృందం జరిపిన సర్వేలో ఇప్పటికిప్పుడు ప్రమాదం లేకపోయినా ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్న సంకేతాలు కనిపించాయి. 40 మందికిపైగా కూటమి ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో వ్యతిరేకత ఎదుర్కొంటున్నట్లు ఆ సర్వేల్లో తేల్చాయి. కాగా హైదరాబాద్ ఐఐటీ బృందం జరిపిన సర్వేలు మాత్రం కూటమి సర్కారుకు ప్రమాద ఘంటికలు మోగుతున్నట్లు అంచనాలు వెలువడ్డాయి. ప్రభుత్వ పనితీరుతో పాటు ఎమ్మెల్యేల పనితీరు, పథకాల ప్రభావం.. ఇలా పలు అంశాలపై ప్రజల అభిప్రాయాలు సేకరించి విశ్లేషించారు. అలాగే ఉమ్మడి జిల్లాల వారీగా పూర్తి వ్యతిరేకత, అసంతృప్తి అనే కోణంలో అభిప్రాయాలు సేకరించారు. రాష్ట్రంలో 294 నియోజకవర్గాలు ఉండగా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 425 మంది చొప్పున 172 నియోజకవర్గాల్లో అభిప్రాయ సేకరణ జరిపారు. శ్రీకాకుళం జిల్లాలో పది సీట్లకుగాను టీడీపీకి 2, బీజేపీ, జనసేనలకు ఒక్కో సీట్లలో వ్యతిరేకత ఉండగా మూడు సీట్లలో టీడీపీపై అసంతృప్తి ఉంది. విజయనగరంలో 8 సీట్లు గెలిచిన టీడీపీ నాలుగింటిలో వ్యతిరేకత, ఒకచోట అసంతృప్తి, జనసేన గెలిచిన ఏకైక సీటులో వ్యతిరేకత ఎదుర్కొంటున్నాయి. విశాఖలో 8 సీట్లు గెలిచిన టీడీపీపై ఒకచోట వ్యతిరేకత, రెండు చోట్ల అసంతృప్తి, నాలుగు గెలిచిన జనసేనపై రెండింట్లో వ్యతిరేకత, ఒకచోట అసంతృప్తి ఉంది. తూర్పుగోదావరిలో 13 సీట్లు గెలిచిన టీడీపీ నాలుగు చోట్ల వ్యతిరేకత, రెండింట అసంతృప్తి, 5 సీట్లలో గెలిచిన జనసేనకు నాలుగుచోట్ల వ్యతిరేకత, ఒకచోట్ల బీజేపీ అసంతృప్తి ఎదుర్కొంటున్నాయి. పశ్చిమగోదావరిలో టీడీపీ గెలిచిన 9 సీట్లలో మూడు చోట్ల వ్యతిరేకత, ఆరు సీట్లు గెలిచిన జనసేన 3 సీట్లలో వ్యతిరేకత, రెండిట్లో అసంతృప్తి ఎదుర్కొంటున్నాయి. కృష్ణా జిల్లాలో 13 సీట్లు గెలిచిన టీడీపీపై ఏడింట వ్యతిరేకత, రెండు చోట్ల అసంతృప్తి ఉంది. గుంటూరు జిల్లాలో గెలిచిన 16 సీట్లలో ఆరు చోట్ల వ్యతిరేకత, రెండుచోట్ల అసంతృప్తిని టీడీపీ ఎదుర్కొంటున్నది. ప్రకాశంలో టీడీపీ 10 సీట్లు గెలవగా నాలుగింటిలో వ్యతిరేకత, రెండింట అసంతృప్తి మొదలైంది. నెల్లూరులో టీడీపీ గెలిచిన 10 సీట్లలో నాలుగుచోట్ల వ్యతిరేకత, రెండు చోట్ల అసంతృప్తి ఉంది. కడపలో టీడీపీ గెలిచిన ఐదింటిలో మూడుచోట్ల వ్యతిరేకత, ఒక చోట అసంతృప్తి ఉండగా చెరో సీటు గెలిచిన జనసేన, బీజేపీలపై వ్యతిరేకత ఉంది. కర్నూలులో 11 సీట్లు గెలిచిన టీడీపీ 5 చోట్ల వ్యతిరేకత, రెండుచోట్ల అసంతృప్తి ఎదుర్కొంటుండగా, బీజేపీ గెలిచిన ఒక్క సీటులోనూ వ్యతిరేకత ఉంది. అనంతపురం జిల్లాలో 13 సీట్లు గెలిచిన టీడీపీకి ఆరుచోట్ల వ్యతిరేకత, ఒకచోట అసంతృప్తి, బీజేపీకి ఒకచోట వ్యతిరేకత ఉంది. చిత్తూరులో 11 గెలిచిన టీడీపీ ఐదు సీట్లలో వ్యతిరేకత, రెండు చోట్ల అసంతృప్తి, జనసేన ఒక చోట వ్యతిరేకత ఎదుర్కొంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే టీడీపీలో 54 మంది ఎమ్మెల్యేలు డేంజర్ జోన్‌లో ఉండగా జనసేనలో 14 మంది, బీజేపీలో నలుగురు డేంజర్ జోన్లో ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. అలాగే ఆరెంజ్ జోన్‌లో టీడీపీకి చెందిన 22 మంది, జనసేనకు చెందిన ముగ్గురు, బీజేపీకి చెందిన ఒక ఎమ్మెల్యే ఉన్నారు. కాగా టీడీపీ నుంచి 59 మంది, జనసేనకు చెందిన నలుగురు, బీజేపీకి చెందిన ముగ్గురు గ్రీన్ జోన్‌లో సేఫ్‌గా ఉన్నారు. మొత్తం మీద ఎన్డీయే కూటమి ఎమ్మెల్యేల్లో 98 మంది పనితీరు బాగలేనట్లు తేలింది. మంత్రులు నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్, ఫరూక్, పార్థసారథి, గుమ్మిడి సంధ్యారాణి, టీజీ భరత్, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రాంప్రసాద్ వ్యతిరేకత ఎదుర్కొంటుండగా అనిత, దుర్గేష్, సవితలపై అసంతృప్తి ఉన్నట్లు వెల్లడైంది.

# సంక్లిష్ట గుండె సమస్యలకు నూతన పరిష్కారం



(సత్యంన్యూస్, గుంటూరు)

కె.ఎల్ డీమ్డ్ యూనివర్శిటీలోని ఫార్మసీ కళాశాలలో పరిశోధన విద్యార్థిని శ్రేయ కొసనం గుండె సంబంధిత సమస్యలకు మొక్కల ఆధారిత చికిత్సలతో నూతన పరిష్కారాలను కనుగొన్నట్లు కెఎల్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్రవర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రాజేశ్వరి పసుపుల మార్గదర్శకత్వంలో గుండె సంబంధిత వ్యాధులపై పరిశోధన చేసిన శ్రేయ కొసనం గుండెకు ఏర్పడే పలురకాల సమస్యలకు సంప్రదాయ మొక్కల నుండి పలు రకాల ఔషధాలు తయారు చేయవచ్చునని పరిశోధనా పత్రాన్ని సమర్పించినట్లు ఆయన తెలిపారు. అందుకు గాను శ్రేయ కొసనం కెఎల్ ఫార్మసీ కళాశాల నుండి పిహెచ్‌డి డిగ్రీని అందుకున్నట్లు తెలిపారు. ఆమె చేసిన పరిశోధనను మెడికల్ పరిభాషలో 'ఇన్వెస్టిగేషన్స్ ఆన్ మిథైల్ గ్లైకోసైడ్ అండ్ సిన్నమోయిల్ డెరివేటివ్ ఫ్రమ్ అగనోస్మా డైకోటోమా ఎగైనెస్ట్ మయోకార్డియల్ ఇస్కీమియా – రిపెర్ఫ్యూజన్ ఇంజురీ, ఇంటిగ్రేటింగ్ కంప్యూటేషనల్ టెక్నిక్స్ విత్ సెల్‌లైన్ వాలిడేషన్ యూజింగ్ హెచ్9సి2 కార్డియో మయోసైట్స్' అని పేర్కొంటారన్నారు. తన థీసిస్‌కు గాను కె.ఎల్.యు ఫార్మసీ కళాశాల శ్రేయ కొసనంకు పిహెచ్‌డి ప్రధానం చేసినట్లు తెలిపారు. సాంప్రదాయ ఔషధ మొక్కల నుండి నెట్‌వర్క్ ఫార్మకాలజీ ద్వారా బహుళ–లక్ష్య చికిత్సా వ్యూహాలను అభివృద్ధి చేయడంపై ఆమె పరిశోధన దృష్టి సారించినట్లు తెలిపారు. హెచ్9సి2 సెల్ నమూనాలలో ప్రయోగాత్మక ధ్రువీకరణతో గణన అంచనాను కలపడం ద్వారా, ఆమె పని అనువాద, బహుళ విభాగ విధానాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సమగ్ర అధ్యయనం సాంప్రదాయ వైద్యం, ఆధునిక ఔషధ శాస్త్రాన్ని వారధిగా చేసుకుని, సంక్లిష్ట గుండె పరిస్థితులను లక్ష్యంగా చేసుకుని మొక్కల ఆధారిత చికిత్సలకు నూతన దిశలను అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆమెను కెఎల్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్రవర్తి, డైరెక్టర్ డాక్టర్ బుచ్చి నాయుడు, ఆర్ ప్యాక్ చైర్మన్ డాక్టర్ నరేంద్ర అభినందించారు. శ్రేయ గుంటూరుకు చెందిన మాజీ శాసనసభ్యులు, ప్రభుత్వ మాజీ విప్ లింగంశెట్టి ఈశ్వరరావుకు మనమరాలు కాగా, పారిశ్రామికవేత్త కొసనం రామారావు–భారతి దంపతుల కుమార్తె కావడం విశేషం.


# ప్రారంభానికి నోచుకోని సచివాలయం-2

**- ఉన్న సచివాలయం కూడా అపరిశుభ్ర వాతావరణమే**

**- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు**

(సత్యంన్యూస్, కొత్తూరు)

మండల కేంద్రంలో గల సచివాలయం–2 నిర్మాణం జరిగినప్పటికీ నేటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఈ మేజర్ పంచాయితీలో ప్రస్తుతం నిర్వహణలో ఉన్న సచివాలయం అపరిశుభ్ర వాతావరణంలో ఉంది. సిబ్బంది ఇక్కడ ఉన్న సచివాలయ భవనంలో పనిచేయడం ఒక నరకంలా ఉందని లబోదిబోమంటున్నారు. ప్రజలకు ఈ సచివాలయ భవనం ఆవరణే మరుగుదొడ్లుగా మారడంతో అటువైపుగా నడవడానికి కూడా చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఈ పక్కనే అంగన్వాడీ కూడా ఉండటంతో ఇక్కడికి వస్తున్న చిన్నపిల్లలు కూడా ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ ఇబ్బందులను అధికారులకు, నాయకులకు ఎంత మొరపెట్టున్న ప్రయోజనం లేకపోతోంది. ఇక ఈ పంచాయతీలో సచివాలయం–2 నూతన భవనం మూడేళ్ల క్రితమే వైకాపా ప్రభుత్వ హయాంలోనే నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ ఈ కొత్త భవనానికి ఇంకా మోక్షం కలగకపోవడంతో కొందరు నాయకులు స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దగ్గర మొర పెట్టుకోగా త్వరలోనే ఈ భవనానికి ప్రారంభిస్తామని చెబుతున్నారని, ఇప్పటికీ ఈ భవనం ప్రారంభానికి నోచుకోలేదని కొందరు గ్రామ ప్రజలు విమర్శిస్తున్నారు. తక్షణమే ఈ భవనం వినియోగంలోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.



# ఎమ్మెల్యే కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి కొల్లు

(సత్యంన్యూస్, రణస్థలం)

శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర రణస్థలంలోని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు శిబిర కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మంత్రిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర అందరితో స్నేహపూర్వకంగా మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు ఎమ్మెల్యే ఈశ్వరరావు పనితీరుతో సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.



# ప్రతీ ఇల్లు ప్లాస్టిక్ రహిత గృహం కావాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాల మేరకు ఆదివారంపేట సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో వరం కాలనీ పార్కులో స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రతీనెల మూడో శనివారం జరిగే ఈ కార్యక్రమంలో ముందుగా శానిటేషన్ ఇన్‌చార్జి శివాజీ అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. పార్కు పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతీఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలని, ప్రతీ గృహం ప్లాస్టిక్ రహిత కుటుంబం కావాలని కోరారు. అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో శ్రద్ధ చూపాలని పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాముల కావాలని కోరారు. ఇంట్లోని వ్యర్థ పదార్థాలను ప్రతి ఉదయం చెత్త వాహనానికి అందించి రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య కార్మికులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెండో డివిజన్ ఇన్‌చార్జి అకెన రాజా రావు, రెడ్డి శివ, జగన్, నాని, సచివాలయ అడ్మిన్ జ్ఞానేష్, జయకృష్ణ, భారతి, సంతు, పద్మ, టెన్నిస్ క్రీడాకారులు పాల్గొన్నారు.






**కథ:**
అభి (కిరీటి).. నడి వయస్సులో ఉన్న తల్లిదండ్రులకు పుట్టిన సంతానం. అతను పుట్టగానే తల్లి చనిపోతుంది. తండ్రి అతణ్ని కళ్లలో పెట్టుకుని పెంచుతాడు. కానీ తండ్రి అతి ప్రేమ కొడుక్కి భారంగా మారుతుంది. తాను కోరుకున్నట్లుగా బాల్యాన్ని గడపలేకపోయిన అభి.. కాలేజీలో సరికొత్తగా జ్ఞాపకాలను పోగేసుకుంటూ జీవితాన్ని ఆస్వాదించాలనుకుంటాడు. ఈ క్రమంలోనే స్ఫూర్తి (శ్రీలీల)తో ప్రేమలో పడతాడు. అభి-స్ఫూర్తి కలిసి ఒక ప్రాజెక్ట్ చేసి.. దాని ద్వార్షానే ఒక సంస్థలో ఉద్యోగాలు సంపాదిస్తారు. కానీ అక్కడ చేరిన మొదటి రోజే సంస్థ యజమాని విజయ (జెనీలియా) ఆగ్రహానికి గురవుతాడు అభి. ఆ కంపెనీని అభి వదిలి వెళ్లిపోవాల్సిన సమయంలోనే అతడికో షాకింగ్ విషయం తెలుస్తుంది.. అదేంటి.. తర్వాత తన జీవితం ఎలా మలుపు తిరిగింది అన్నది మిగతా కథ.

**నటీనటులు:** కిరీటి మంచి భవిష్యత్తు ఉన్న కుర్రాడే. తొలి సినిమాలో తన టాలెంట్స్ అన్నీ చూపించేశాడు. తనకు జూనియర్ ఎన్టీఆర్ అంటే ఎంత అభిమానమో ప్రమోషన్లలో బలంగా చెప్పిన కిరీటి.. తెర మీద తన ఆరాధ్య నటుడిని గుర్తు చేసేలా అద్భుతమైన డ్యాన్సులతో అలరించాడు. 'వైరల్ వయ్యారి' పాటలో అయితే తారక్ మరో వెర్షన్ ను చూస్తున్నట్లు అనిపిస్తుంది. ఫైట్లలో కూడా అతను చూపించిన చురుకుదనం ఆకట్టుకుంటుంది. కిరీటి నటనలోనూ పాస్ మార్కులే వేయించుకున్నాడు. కొత్త వాడైనా తడబడకుండా నటించాడు. ఎమోషనల్ సీన్లలో బాగా చేశాడు. శ్రీలీల కేవలం పాటల కోసమే సినిమాలో ఉంది. తన నుంచి ఆశించే అదిరిపోయే డ్యాన్సులతో ఆకట్టుకుంది. ద్వితీయార్ధంలో ఆమె పూర్తిగా అంతర్ధానం అయిపోయింది. 13 ఏళ్ల తర్వాత సౌత్ సినిమాలో రీఎంట్రీ ఇచ్చిన జెనీలియాకు కీలకమైన పాత్రే దక్కింది కానీ.. మూడీగా సాగే ఆ క్యారెక్టర్ ఆమె అభిమానులకు అంతగా రుచించకపోవచ్చు. తన పెర్ఫామెన్స్ జస్ట్ ఓకే అనిపిస్తుందంతే. హీరో తండ్రి పాత్రలో రవిచంద్రన్ ఆకట్టుకున్నాడు. రావు రమేష్ కూడా తన ప్రత్యేకతను చాటుకున్నాడు. విలన్ల పాత్రలు చాలా వీక్. అచ్యుత్ కుమార్.. మరో కొత్త నటుడు సాదాసీదాగా అనిపిస్తారు. హీరో స్నేహితులుగా వైవా హర్ష.. మిగతా ఆర్టిస్టులు పర్వాలేదు.

# కథ వీకే గానీ.. కుర్రాడు కేక!

**కథనం-విశ్లేషణ:**

ఓ సినిమాపై మంచి బడ్జెట్ పెట్టి ఒక కొత్త హీరోను లాంచ్ చేస్తున్నారు అంటే.. ప్రధానంగా ఫోకస్ చేసేది తన ప్రతిభా పాటవాలను చాటడం మీదే. తెరపై చలాకీగా కనిపించి.. డ్యాన్సులు– ఫైట్లలో నైపుణ్యం చూపించి.. నటనలో నాట్ బ్యాడ్ అనిపిస్తే ఆ సినిమా లక్ష్యం నెరవేరినట్లే. ఇక్కడి వరకు అయితే 'జూనియర్' సక్సెస్ అయినట్లే. మన సినీ కుటుంబాలకు చెందిన కుర్రాడు కాకపోయినా.. కిరీటి చూడగానే నచ్చేస్తాడు. ఎక్కువ బిల్డప్ లేకుండా.. ఏమాత్రం అతి చేయకుండా.. 'జూనియర్'లో అన్నిరకాలుగా తన టాలెంట్స్ చూపించడానికి మంచి ప్రయత్నమే చేశాడు కిరీటి. ఒక కొత్త హీరో నుంచి ఇంత గొప్ప డ్యాన్స్ ఈ మధ్య కాలంలో చూసి ఉండం అంటే అతిశయోక్తి కాదు. ఇక లైవ్ వైర్‌లా కదులుతూ అతను చేసిన యాక్షన్ సీక్వెన్సులు కూడా అదిరిపోయాయి. నటన సూపర్ అని చెప్పలేం కానీ.. ఉన్నంతలో అన్ని ఎమోషన్లనూ బాగానే పలికించాడు. కానీ వీటన్నింటికీ ఓ మంచి కథ కూడా తోడై.. సినిమా కూడా ఆసక్తికరంగా సాగి ఉంటే 'జూనియర్' కిరీటికి డ్రీమ్ డెబ్యూ అయ్యేది. కానీ ఆ అంశాల్లో ఈ చిత్రానికి మైనస్ మార్కులే పడతాయి. సాధారణంగా సాగే 'జూనియర్' కథలో కిరీటి మెరుపులే సినిమాకు హైలైట్.

'జూనియర్' తీసింది కన్నడ దర్శకుడు. ఈ చిత్రంతో పరిచయం అయింది తెలుగు మూలాలున్న కన్నడ కుర్రాడు. కానీ సినిమా చూస్తుంటే 'కన్నడ' ఫీలింగ్ రవ్వంతైనా కలగదు. కథాకథనాల్లో కమర్షియల్ తెలుగు సినిమాల ఫార్మాట్‌నే ఫాలో అయిపోయారు. ఇక్కడ ఒక హీరోను లాంచ్ చేసేటపుడు అతణ్ని హైలైట్ చేస్తూ ఎలా కథను నడిపిస్తారో అలాగే నడిపించారు. మన సినిమాలనే అటు ఇటు తిప్పి కథను వండారు. ఒక ప్రత్యేకమైన లక్షణమున్న కుర్రాడిగా హీరో పరిచయం.. కాలేజీలో ఒక బ్యాచ్ వేసుకుని అల్లరి చేయడం.. కథానాయికతో పరిచయం.. తనతో లవ్ ట్రాక్.. ఇలా తొలిగంటను సరదాగా అలా అలా నడిపించేసి.. ఆ తర్వాత ఒక ట్విస్టుతో కథకు ఎమోషనల్ టచ్ ఇచ్చి.. హీరోకు ఒక సమస్యలో పడేసి.. దాన్ని పరిష్కరించడం మీద ద్వితీయార్ధాన్ని లాగించడం.. ఇలా చాలా తెలుగు సినిమాలను గుర్తు చేసేలా సాగుతుంది 'జూనియర్'. కానీ ఇటు ప్రథమార్ధంలో కాలేజీ ట్రాక్ కానీ.. అటు ద్వితీయార్ధంలో పల్లెటూరి ఎపిసోడ్లు కానీ ఏమంత గొప్పగా అనిపించవు. కామెడీ.. రొమాన్స్.. ఎమోషన్లు.. అన్నీ సాధారణమే. కానీ హీరో మాత్రం ఎక్కడికక్కడ తన టాలెంట్ చూపిస్తుంటాడు. అతనే ప్రేక్షకులను ఎంగేజ్ చేస్తుంటాడు.

అనుకోని పరిస్థితుల్లో దూరమైన తండ్రీ కూతుళ్లను కలపడానికి ఒక కొడుకు చేసే ప్రయత్నమే ఈ సినిమా. 'అత్తారింటికి దారేది'ని గుర్తు చేసే ఈ పాయింట్ చుట్టూ నడిపిన ఎమోషనల్ డ్రామా సరిగా పండలేదు. తండ్రి–కూతురు విడిపోవడానికి దారితీసిన కారణం బలంగా కనిపించదు. కథలో మలుపు కోసం బలవంతంగా వాళ్లను విడదీసినట్లు అనిపిస్తుంది. అందుకే ప్రేక్షకులు ఈ పాయింట్ విషయంలో ఎమోషనల్ అవ్వడానికి అవకాశం లేకపోయింది. వాళ్లు కలవాలని బలంగా కోరుకోనపుడు... కలిసినపుడు భావోద్వేగాలు పండవు. ద్వితీయార్ధంలో 'మహర్షి' సహా పలు చిత్రాలను తలపించేలా సాగే విలేజ్ ఎపిసోడ్లు కూడా అంతంతమాత్రంగా అనిపిస్తాయి. వీటితో పోలిస్తే ప్రథమార్ధంలో కాలేజ్ సీన్లే కొంచెం నయం అనిపిస్తాయి. రొమాంటిక్ ట్రాక్ మాత్రం పూర్తిగా తేలిపోయింది. అది పాటలకు మాత్రమే ఉపయోగపడింది. కథలో కీలక మలుపు దగ్గర 'జూనియర్' ఎంగేజ్ చేస్తుంది. కానీ ఆ ట్విస్టు తర్వాత రొటీన్ ట్రాక్ ఎక్కేస్తుంది. దర్శకుడు ముగింపులో మళ్లీ చిన్న ఎమోషనల్ ట్విస్ట్ ఇచ్చి ప్రేక్షకుల అటెన్షన్ రాబట్టాడు కానీ.. దాని వల్ల సినిమా గ్రాఫ్ అయితే పెరగదు. ఓవరాల్ గా చెప్పాలంటే మేకర్స్ కోరుకున్నట్లు కొత్త హీరో ఇందులో బాగానే హైలైట్ అయ్యాడు కానీ.. సినిమాగా మాత్రం 'జూనియర్'కు బిలో యావరేజ్ మార్కులే పడతాయి.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..

**సాంకేతిక వర్గం:** 'జూనియర్'కు దేవిశ్రీ ప్రసాద్.. సెంథిల్ కుమార్ లాంటి టాప్ టెక్నీషియన్లు పని చేశారు. వాళ్లు సినిమాకు తాము అందించాల్సిన సహకారం అందించారు. దేవిశ్రీ ప్రసాద్ పాటలు మంచి ఊపుతో సాగుతాయి. కిరీటి తన డ్యాన్సింగ్ టాలెంట్ చూపించడానికి అవసరమైన సాంగ్స్ అతను అందించాడు. దేవి నేపథ్య సంగీతం కూడా ఓకే. సెంథిల్ కుమార్ విజువల్స్ బాగున్నాయి. సినిమా కలర్‌ఫుల్‌గా సాగింది. నిర్మాణ విలువలకు ఢోకా లేదు. చాలా రిచ్‌గా తీశారు. కళ్యాణ చక్రవర్తి మాటలు కొన్ని చోట్ల పేలాయి. దర్శకుడు రాజశేఖర్ రెడ్డి.. డెబ్యూ హీరోను హైలైట్ చేయడం మీద దృష్టిపెట్టాడు. అందులో అతను విజయవంతం అయినా.. కథాకథనాల్లో నిరాశపరిచాడు. తన స్టోరీ సాధారణంగా అనిపిస్తుంది. స్క్రీన్ ప్లే కూడా ఒక టెంప్లేట్లో సాగిపోయింది.

## జాప్ జిల్లా అధ్యక్షునిగా షన్ముఖరావు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాప్ జిల్లా అధ్యక్షునిగా జి.షణ్ముఖరావు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ గంజి ఎజ్రాను ప్రకటించారు. నగరంలోని ఎన్‌జీవో హోంలో శుక్రవారం జాప్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా టెంక శ్రీనివాస్, ట్రెజరర్‌గా పక్కి వేణుగోపాలరావు, వైస్ ప్రెసిడెంట్లుగా నలుగురు, సెక్రటరీలుగా నలుగురు, జాయింట్ సెక్రటరీలుగా నలుగురిని ఎన్నుకున్నారు. 40మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రబాబు (రవితేజ), రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా జాప్ సేవలు మరింత విస్తృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు కొంక్యాన వేణుగోపాలరావు, శాసపు జోగినాయుడు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## 3న జిల్లా స్థాయి యోగాసన పోటీలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగాసన పోటీలు ఆగస్టు మూడో తేదీన నరసన్నపేటలో నిర్వహించనున్నట్లు నేషనల్ యోగ స్పోర్ట్స్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల నుంచి 55 సంవత్సరాల వయసు వరకు 12 కేటగిరీలలో పోటీలు ఉంటాయన్నారు. సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక జిల్లాస్థాయి నుంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి నేషనల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి కేదార్నాథ్, ఉపాధ్యక్షులు తంగి స్వాతి, కొంక్యాన మురళీధర్, సహాయ కార్యదర్శి అర్చన, జాయింట్ సెక్రటరీ జీవిత, ట్రెజరర్, శ్రీనివాస్ సభ్యులు రామారావు, చిన్నబాబు రమ్య, పూర్ణానంద్ పాల్గొన్నారు. ఈ యోగాసన పోటీల్లో పాల్గొనాలనుకునే ఔత్సాహికులు 96764 72733, 94902 83787, 94922 66889 నెంబర్లను ఫోన్ ద్వారా సంప్రదించాలని ఈ సందర్భంగా కోరారు.

# నాడు ఆమెపైకి నెపం.. మరి ఇప్పుడెవరిది ఆ పాపం!

మొదటిపేజీ తరువాయి

ఎ.మోహన్‌రాజు గారికి విన్నవించగా ఆయన మాకు అనుమతి ఇచ్చారు. అయితే ప్రిన్సిపాల్ సురేఖ సెలవు నుంచి వచ్చిన తర్వాత ఆయనపై రుసరుసలాడారు. మూల్యాంకనం కూడా అభ్యసన, బోధన ప్రక్రియలో భాగమే కదా.. మేడమ్ అని ఆయన అన్నారు.'

..ఇవి అప్పటి ప్రిన్సిపాల్ డాక్టర్ పెంకి సురేఖ స్పాట్ వాల్యూయేషన్ నియమాలను ఉల్లంఘించారంటూ 17 మంది అధ్యాపకులు సంతకాలు చేసి 2022 అక్టోబర్ 13న రాష్ట్ర ముఖ్యమంత్రికి అడ్రస్ చేస్తూ పంపిన ఫిర్యాదులోని కొన్ని అంశాలు.

### ఏళ్లుగా అవే డిమాండ్లు

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలో డాక్టర్ సురేఖపై చేసినన్ని ఫిర్యాదులు బహుశా రాష్ట్ర చరిత్రలో ఎవరి మీదా.. ఎవరూ చేసుండరు. వీటిపై విచారణ జరిగినా.. దోషులెవరో తేలకపోయినా.. ఫిర్యాదుల పరంపర మాత్రం ఆగలేదు. ఆ క్రమంలో 2022 అక్టోబర్‌లో చేసిన ఫిర్యాదులో ఉన్న అంశాలు నిజమా కాదా అన్నది కాసేపు పక్కన పెడదాం. ఇప్పుడు ఆర్ట్స్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సురేఖ లేరు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా స్థానిక వర్సిటీ నుంచి డిగ్రీ ఫోర్త్ సెమిస్టర్ పేపర్లు దిద్దడానికి రండి అంటూ గత నెల మొదటి వారంలో ఆదేశాలు వచ్చాయి. కానీ తాము ఈ మూల్యాంకనానికి రామని, తమ డిమాండ్లు పరిష్కరించేవరకు స్పాట్ వాల్యూయేషన్‌లో పాల్గొనబోమంటూ కళాశాల అధ్యాపకులు ఒక వినతిపత్రం విడుదల చేశారు. చీఫ్ ఎగ్జామినర్, అసిస్టెంట్ ఎగ్జామినర్లకు రెమ్యునరేషన్ పెంచాలని, పేపరుకు రూ.15 నుంచి రూ.20 వరకు ఇవ్వాలని, స్పాట్ వాల్యూయేషన్‌కు వచ్చే వారికి డీఏలు ఇవ్వాలని, ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్లకు లోకల్ కన్వేయన్స్ ఇవ్వాలంటూ.. మొత్తం ఏడు డిమాండ్లను వర్సిటీ అధికారుల ముందుంచి, వాటిని నెరవేర్చేవరకు స్పాట్ వాల్యూయేషన్లు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ డిమాండ్లు కొత్తవి కావు.. 2022లో సురేఖపై ఫిర్యాదు చేయకముందే యూనివర్సిటీ అధికారుల ముందు ఉంచారు. ఇప్పటి వరకు వాటిని నెరవేర్చకపోవడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు కూడా ప్రకటించారు.

### ఆమెపై అనసరంగా నెపం

మరి.. ఈ మాత్రం దానికి తమను స్పాట్ వాల్యూయేషన్‌కు వెళ్లనివ్వడంలేదని, రిలీవ్ చేయమంటే కమిషనర్‌తో మాట్లాడుకుంటానని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సురేఖ పెద్ద మాటలన్నారంటూ అప్పుడు నేరుగా ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయడమెందుకో అర్థం కాలేదు. అంతేకాదు 2022 నుంచి మొన్నటి వరకు సురేఖ ప్రిన్సిపాల్‌గా ఉండి దీన్ని ఆపేశారని ప్రచారం చేశారు. మరి ఇప్పుడెందుకు స్పాట్ వాల్యుయేషన్‌ను బహిష్కరించారో యూనియన్ నాయకులు చెప్పడంలేదు. వాస్తవానికి గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్, గవర్నమెంట్ కాలేజ్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ పేరుతో రెండు సంఘాలు ఉన్నాయి. వీటికే రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ గుర్తింపు ఉన్నాయి. ఈ లెటర్ హెడ్లను అడ్డు పెట్టుకునే ప్రతి సారీ బదిలీల నుంచి కొందరు తప్పించుకుంటున్నారు. కానీ ఇప్పుడు ఈ రెండు సంఘాల లెటర్ హెడ్లను పక్కన పెట్టి కాంట్రాక్ట్ అండ్ గెస్ట్ టీచర్స్ అసోసియేషన్ పేరుతో వర్సిటీకి మెమొరాండం ఇచ్చారు. భవిష్యత్తులో ఇది బూమరాంగ్ అయితే.. అసలు ఈ అసోసియేషన్‌కు, తమకు సంబంధం లేదని దీర్ఘ కాలంగా ఇక్కడ తిష్ట వేసుక్కూర్చున్నవారు చేతులెత్తేయడానికి వీలుగా దీన్ని సృష్టించారు.

### సెలవులు కుదించారని యాగీ

తాము కళాశాల సెలవుల్లో స్పాట్ వాల్యుయేషన్‌కు రాలేమని స్పష్టం చేయడం వల్లే స్థానిక వర్సిటీ సెలవులను కుదించేసి, జూన్ 16కే కళాశాలలు తెరవాలని ఆదేశాలిచ్చారంటూ రిజిస్ట్రార్ సుజాతపై ప్రచారం చేశారు. వాస్తవానికి ప్రధానమంత్రి సమక్షంలో గిన్నిస్‌బుక్ వరల్డ్ రికార్డ్ కోసం విశాఖలో యోగా డే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఉన్నత విద్యాశాఖ అన్ని యూనివర్సిటీల పరిధిలోని కళాశాలలు జూన్ 16న తెరిచి యోగాపై ఒక రోజు శిక్షణ ఇచ్చి, వారిని వైజాగ్ తీసుకురావాలని ఆదేశాలిచ్చింది. అందులో భాగంగానే ఇక్కడ కాలేజీ కూడా జూన్ 16న తెరిచారు. వాస్తవం ఇదయితే.. తమను మూల్యాంకనానికి రప్పించడానికే రిజిస్ట్రార్ సుజాత ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని అసోసియేషన్ నాయకులు గగ్గోలుపెట్టారు. తమ యూనివర్సిటీ పరిధిలో ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు స్పాట్ వాల్యుయేషన్‌ను బహిష్కరిస్తామంటున్నారని వర్సిటీ వీసీ ఉన్నత విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అదే సమయంలో విజయవాడలో కళాశాల ప్రిన్సిపాళ్లతో కమిషనర్ వర్క్‌షాప్ నిర్వహించి స్పాట్ వాల్యుయేషన్‌కు వెళ్లని వారిని క్షమించలేమంటూ వార్నింగ్ ఇచ్చారు. అయితే ఆ వర్క్‌షాప్‌కు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ హాజరుకాలేదు. అది వేరే సంగతి. అయితే కళాశాలలు రీ ఓపెన్ అయిన తర్వాత మాత్రమే స్పాట్ వాల్యుయేషన్ చేపడతామని వీరు మరో కండిషన్ పెట్టారు. కానీ రాష్ట్ర వ్యాప్తంగా మిగిలిన అన్ని యూనివర్సిటీల పరిధిలో సెలవు రోజుల్లోనే నిర్వహించారు. స్పాట్ వాల్యూయేషన్‌లో పాల్గొనే అధ్యాపకులకు సంబంధిత వర్సిటీలు రెమ్యునరేషన్ ఇస్తాయి. ఇదేదో ఉచితంగా చేసే పని కాదు. పనిదినాల్లో క్లాసులు చెప్పాలి కాబట్టి సెలవు రోజుల్లో స్పాట్ వాల్యుయేషన్‌కు రావాలని పిలుస్తారు. కానీ మన ఆర్ట్స్ కాలేజ్ అధ్యాపకులు మాత్రం క్లాసులు ఎగ్గొట్టి మాత్రమే వాల్యూయేషన్‌కు వస్తామని, అయినా తమకు రెమ్యునరేషన్ మాత్రం ఇచ్చేయాలని అంటున్నారు. మొత్తానికి కమిషనర్ ఒత్తిడి కానీయండి, క్లాసులు ఎగ్గొట్టి పేపర్లు దిద్దే అవకాశం వచ్చిందనుకోండి.. ఏది ఏమైనా మొత్తానికి ఫోర్త్ సెమిస్టర్ స్పాట్ వాల్యూయేషన్ పూర్తయింది. కానీ వీరి డిమాండ్లేవీ ఎప్పట్లాగే పరిష్కారం కాలేదు. కాకపోతే ఈసారి నెపం నెట్టేయడానికి సురేఖ లేరు. అలాగే సెకండ్ సెమిస్టర్ పేపర్లు కూడా దిద్దకపోవడంతో వాటిని టెక్కలి, రాజాం ఉమెన్స్ కాలేజీలకు పంపించి పని పూర్తి చేశారు. ఇప్పుడు వీరి నిర్వాకం వల్ల ఆర్ట్స్ కళాశాలకు ప్రాక్టికల్స్ రీజనల్ సెంటర్ కూడా ఇవ్వకుండా రాజాం, ఉమెన్స్ కాలేజీలకు బదిలీ చేస్తున్నట్టు తెలిసింది. 2022.. ఆ తర్వాత స్పాట్ వాల్యూయేషన్‌కు వెళ్లడానికి సురేఖ అడ్డు చెప్పారని ఫిర్యాదు చేసిన నాయకులు ఇప్పుడెందుకు పేపర్లు దిద్దడానికి వెళ్లలేదన్న విషయం మాత్రం బయటకు చెప్పరు. ఉమెన్స్ కాలేజీకి వెళ్లి పేపర్లు దిద్దడానికి పోటీ పడిన అధ్యాపకులు ఇప్పుడు తమ సొంత కాలేజీలోనే పేపర్లు దిద్దే అవకాశమొస్తే చేతులెత్తేశారు. ఈసారి స్పాట్ వాల్యూయేషన్‌కు వెళ్లమని, గతంలో సురేఖ వెళ్లనివ్వడంలేదని విప్లవం రేకెత్తించిన కెమిస్ట్రీ అధ్యాపకుడు గత తొమ్మిదేళ్లలో ఎన్ని స్పాట్ వాల్యూయేషన్లకు హాజరయ్యారో ఒక్కసారి రికార్డులు తిరగేస్తే తెలుస్తుంది. ఎందుకంటే.. ఈ తతంగాన్ని తెర వెనుక నడిపింది ఆయనే.

**వర్సిటీకి నిమ్మ వెంకటరావు వీసీగా ఉన్నప్పుడు గుర్తుకురాని డిమాండ్లు, స్పాట్ వాల్యూయేషన్ బహిష్కరణలు ఇప్పుడు ఎందుకు తెరమీదకు వచ్చాయి? వర్సిటీలో ఏ కులనాయకుడ్ని రక్షించడానికి ఆర్ట్స్ కళాశాలలో నాటకాలు మొదలయ్యాయి? వంటి అంశాలతో మళ్లీ కలుద్దాం.**

### అజాత శత్రువు
## అశోక్ గజపతిరాజు



(సత్యంన్యూస్, విజయనగరం)

గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు నియమితులు కావడం చాలా సంతోషమని ఏపీ హోంమంత్రి అనిత అన్నారు. శనివారం ఆమె అశోక్ గజపతిరాజును విజయనగరంలోని నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. రాష్ట్ర, దేశవ్యాప్తంగా అశోక్ గజపతిరాజు సేవలు విస్తరించాయన్నారు. రాజకీయాల్లో ఎలాంటి ఆరోపణలు లేని వ్యక్తి అని, నీతికి, నిజాయతీకి మారుపేరని కొనియాడారు. ఆయన 50 ఏళ్లుగా విజయనగరం జిల్లాకు అనేక సేవలు చేశారని చెప్పారు. మాన్సాస్ ట్రస్టును నడుపుతున్న మంచి మనసున్న వ్యక్తి అని పేర్కొన్నారు. అజాత శత్రువుగా పేరు పొందిన వ్యక్తి అశోక్ గజపతిరాజు అని, అలాంటి వ్యక్తిని గత వైకాపా ప్రభుత్వం ఎన్ని విధాలుగా ఇబ్బంది పెట్టిందో అందరికీ తెలుసని, జగన్ కక్ష సాధింపులతో కేసులు పెట్టి వేధించేవారని, అందుకే వైకాపా సీట్లు 11కు దిగజారాయన్నారు. ఎప్పుడైనా సమాజానికి ఉపయోగపడే విధంగా రాజకీయాలు చేయాలని, విలువలు, ఆదర్శం, నీతి, నిజాయతీ కలిగిన అశోక్ గజపతి రాజు లాంటి వ్యక్తిని చూసి ఎంతో నేర్చుకున్నామని అనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, పూసపాటి అదితి గజపతిరాజు పాల్గొన్నారు.



## 'ముంజూరు' ఆవిష్కరణ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కళింగాంధ్ర సామాజిక చైతన్యాన్ని, స్ఫూర్తిని రగిలించడానికి ఈ ప్రాంతపు కవుల కవిత్వంతో ఒక కవితా సంకలనం తీసుకురావడం ముదావహమని సీనియర్ జర్నలిస్టు, కవి నల్లి ధర్మారావు అన్నారు. సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో హరిపురంలో జరిగిన పుస్తక ఆవిష్కరణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ కళింగాంధ్ర యాస, భాష తెలుగు భాషకే తలమానికమని వివరించారు. ఈ ప్రాంతం అనాదినుంచి సాహితీవేత్తలు, కవులు, కళాకారులకు పుట్టినిల్లని గుర్తు చేశారు. విశిష్టమైన కృషితో 260 మంది కవుల సమాచారాన్ని సేకరించిన సంపాదకుడు రవికుమార్‌ను అభినందించారు. మామిడి కృష్ణారావు అధ్యక్షత వహించగా, సీనియర్ రచయిత కింతల కృష్ణమూర్తి పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ కణితి కేశవరావు తొలి ప్రతిని స్వీకరించారు. శాతవాహన కళాశాల విద్యార్థులు సుమారు 300 మంది హాజరు కాగా, కళింగాంధ్ర చారిత్రక ప్రాధాన్యాన్ని, వెనుకబాటుతనానికి కారణాలను సిక్కోలు బుక్స్ వ్యవస్థాపకులు దుప్పల రవికుమార్ తెలియజేశారు. ఈ సమావేశంలో డాక్టర్ కుమార్‌నాయక్, వినోద్ కుత్తుమ్, రాపాక ధనరాజు, పి.రాజేంద్ర, ఎం. గణపతి, లోకేశ్వరరావు, రామారావు, దాసరి తాతారావు, వంకల రాజారావు తదితరులు పాల్గొన్నారు.





**మధ్యతరగతి బతుకులతో ముడిపడ్డ కొన్ని విలాసవంతమైన, వినోదమైన వస్తువుల సేకరణ ఒక మురిపాన్నిచ్చేది. అలాంటి మురిపాన్ని పొందిన ఒకనాటి సూట్‌కేసు మీకు గుర్తుందా? ఆ రోజుల్లో కాస్ట్‌లీ. కానీ అది ఉందంటే ఆ దర్జానే వేరు. అదే వీఐపీ సూట్‌కేస్. సుమారు భారతీయ మార్కెట్‌ను 53 ఏళ్ల పాటు ఏలింది ఆ సూట్‌కేస్. కానీ, ఆ సూట్‌కేస్ సృష్టికర్త ఇప్పుడు తన వాటాలను అమ్ముకోవాల్సిన దైన్యస్థితి ఎదుర్కొంటున్నాడు. మరి ఆ సూట్‌కేసు వెనుకనున్న కథేంటి? ఇప్పుడెందుకు ఆయన వాటాలను అమ్ముకోవాల్సి వస్తోంది? అసలాయనెవరు? రండి కాస్త తెలుసుకుందాం!**

## ఐదు దశాబ్దాలు మార్కెట్‌ను ఏలిన వీఐపీ..
# ఇప్పుడెందుకు వాటాలు అమ్ముకుంటోంది..?

వీఐపీ సూట్ కేసులు, బ్యాగులతో భారత మార్కెట్‌లో పేరెన్నికగన్న లగేజ్ ట్రాన్స్‌పోర్టేషన్‌కు తెరతీశాడు దిలీప్ పిరమిల్. సుమారు ఐదు దశాబ్దాలుగా వీఐపీ కంపెనీకి చైర్మన్‌గా ఉన్న దిలీప్ పిరమిల్.. భారతదేశాన్ని ఒక ఊపు ఊపిన తన వీఐపీ కంపెనీకి సంబంధించి 51.73 శాతం షేర్లలో 32 శాతం వాటాలను విక్రయించడానికి సిద్ధపడ్డారు. ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడిదారులు, కొనుగోలుదారుల కన్సార్షియంకు విక్రయించడానికి అంగీకరించడానికి ఇప్పటికే సర్వం సిద్ధం చేశాడు. దీంతో ప్రస్తుతం 19.73 శాతానికి వీఐపీలో ఈక్విటీ పడిపోయింది. స్టాక్ ఎక్ఛేంజ్ ఫైలింగ్‌లో కూడా ఈ విషయం అధికారికంగా ప్రకటించడంతో ఒక ఐకానిక్ బ్రాండ్ శకం ముగింపు దశకు చేరుకుంది.

ఎన్డీటీవీ ప్రాఫిట్‌తో మాట్లాడిన పిరమిల్.. తమ వాటాలమ్ముకుని తప్పుకోవాలనుకునే నిష్క్రమణ వెనుక బలమైన కారణముందని వెల్లడించాడు. తన కుటుంబంలో గానీ, తర్వాతి తరంలోని వారసత్వం గానీ ఎవ్వరూ కూడా ఇక ముందు ఈ వ్యాపారాన్ని నడపడానికి పెద్దగా ఆసక్తి కనబర్చడంలేదన్నారు పిరమిల్. నాయకత్వ శూన్యత ఏర్పడటంతోనే తమ వాటాలను అమ్ముకుంటున్నట్టు వెల్లడించారాయన.

భారతదేశ లగేజ్ బ్యాగింగ్‌లో తిరుగులేని రారాజుగా, మార్కెట్ లీడర్‌గా వీఐపీది ఓ చరిత్ర. కానీ, ఇప్పుడా ఇండస్ట్రీ సంపద క్షీణదశకు చేరుకుంటోంది. గత ఐదు దశాబ్దాలు తిరుగులేని రారాజుగా ఉన్న వీఐపీ.. గత ఐదేళ్లుగా మాత్రం మార్కెట్ లేక పడిపోయింది. గత ఏడాది నాలుగు త్రైమాసికాల్లోనూ తీవ్ర నష్టాలను చూసింది వీఐపీ సంస్థ.

6800 కోట్ల వ్యాపార సామ్రాజ్యం వీఐపీది. కానీ, ఇప్పుడు నష్టాలను చవిచూస్తోంది. దీంతో మిథున్, సంవిభాగ్ సెక్యూరిటీస్, సిద్ధార్థ సంచేటీకి చెందిన మల్టిపుల్ ప్రైవేట్ ఈక్విటీస్.. 1763 కోట్ల ఒప్పందంతో వీఐపీలో వాటాలు దక్కించుకున్నాయి. బాంబే స్టాక్ ఎక్ఛేంజ్‌లో జూలై 11న ఉన్న ముగింపు ధర కంటే కూడా 15 శాతం తక్కువకు.. కేవలం 388 రూపాయలకొక్క షేర్ చొప్పున ఈ కంపెనీ వాటాలను విక్రయించేశారు.

రెండేళ్ల క్రితమే వీఐపీని కొనుగోలు చేసేందుకు తమకు ఇంకో సువర్ణావకాశం వచ్చిందని సీఎన్బీసీ టీవీ 18కు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ దిలీప్ పిరమిల్ వెల్లడించారు. అప్పుడు ఒక్కో షేర్ ధర 700 పలికిందని.. మార్కెట్ క్యాపిటల్ ధర 10వేల కోట్లు పలికిందని, కానీ ఆఫర్‌ను తాము ఉపయోగించుకోలేకపోయామని ఆయన ఒకింత బాధపడ్డారు. ఆర్నెల్ల నుంచి ఏడాది కాలంలోపు మరో 50 శాతం తమ షేర్ ధర పెరుగుతుందని భావించామని, కానీ, దురదృష్టవశాత్తూ అలా జరక్కపోగా.. పడిపోయిందన్నారు పిరమిల్.

వాటాదారుల ఇంట్రస్టే తమ ప్రథమ ప్రాధాన్యతని చెప్పారు దిలీప్ పిరమిల్. ఈ పరిస్థితుల్లో కొత్త మేనేజ్‌మెంట్‌ను తీసుకురావడమొక్కటే సరైన ఆచరణీయ మార్గమంటారాయన. అందుకే ప్రైవేట్ ఈక్విటీ షేర్ హోల్డర్స్‌ను ఎంచుకున్నామని, వారైతేనే 2 నుంచి 3 ఏళ్ల లక్ష్యంతో పెట్టుబడిని రెండు లేదా మూడింతలు చేయగలరన్న నమ్మకం ఉందంటారు పిరమిల్.

అయితే, వీఐపీ వాటాలమ్ముకునే పరిస్థితి రావడం దురదృష్టకరమే అయినప్పటికీ.. భవిష్యత్తులో మేనేజ్మెంట్ బోర్డులో మాత్రం తమ కుటుంబం స్థానమైతే నిలుపుకోగలదనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు పిరమిల్. అందుకే, తాను 32 శాతం కంటే ఎక్కువ వాటాను విక్రయించాలనుకోవడం లేదని.. ముఖ్యంగా తనకు డబ్బు కన్నా.. తన షేర్ విలువ పెరగడమే ముఖ్యమంటారు. ప్రస్తుతం వీఐపీ కంపెనీ మేనేజ్మెంట్ సమస్యలతో




సతమతమవుతోంది. అయితే, వీఐపీ ఫండమెంటల్స్ ఎప్పుడూ బలంగానే ఉంటాయని.. త్వరలో తిరిగి మళ్లీ పునరుత్తేజితమవుతుందంటున్నాడు పిరమిల్. అందుకే వచ్చే పెట్టుబడిదారులను కూడా కాస్త ఓపికతో ఉండాలని.. మేనేజ్మెంట్ మార్పు కూడా అంత సులభం కాదని చెబుతున్నాడు. భారతదేశ లగేజ్ పరిశ్రమలో తనకంటూ ఒక బ్రాండ్ క్రియేట్ చేసుకున్న వీఐపీకి అవకాశాల్లేకపోలేదు.

అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా వీఐపీ తన సత్తా చాటుతుందని ఆశనైతే తనకుందంటాడు పిరమిల్. అంతేకాదు బహుళజాతి కంపెనీగా కూడా ఎదిగే అవకాశాలూ వీఐపీ వంటి సంస్థకుందనే నమ్మకాన్నీ మరోవైపు దిలీప్ పిరమిల్ కనబరుస్తున్నాడు. మొత్తంగా ఒక ఐదు దశాబ్దాల పాటు ఇండియాలో ఒక ఉత్థానాన్ని చూసిన వీఐపీ ఇప్పుడు అదే స్థాయిలో పతనాన్నీ చూస్తోంది.

- బాతాఖానీ సౌజన్యంతో..















# ఏఎంసీ నియామకం రద్దు

## – ఫలించిన జనసైనికుల పోరాటం –

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దారపు జ్యోత్స్నను నియమిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను నిలిపివేసినట్లు విశ్వసనీయ వర్గాల భోగట్టా. పార్టీలో మొదట్నుంచి కష్టపడిన కార్యకర్తలను కాదని ఎన్నికలకు ముందు పార్టీలో చేరి, ఆ తర్వాత కూడా పక్క పార్టీతో సన్నిహిత సంబంధాలు నెరిపారంటూ జనసైనికులు శుక్రవారం పార్టీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. దారపు జ్యోత్స్న నియామకాన్ని పునఃపరిశీలించాలనే డిమాండ్‌తో వీరు నిరసన చేపట్టడం వల్ల జనసేన అధిష్టానం దీనిపై ఆరా తీసింది. అన్ని విషయాలూ పరిశీలించాక ఆమె నియామకాన్ని రద్దు చేసి, కొత్త ప్రతిపాదనను సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తుంది. ఈ విషయం జనసేనపార్టీ అధికారికంగా ధ్రువీకరించకపోయినా స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌కు మాత్రం జనసేన కార్యాలయం నుంచి సమాచారం అందింది. దీంతో దారపు జ్యోత్స్న ప్రమాణస్వీకారానికి దూరంగా ఉండాలని పార్టీ ఆదేశాలివ్వనుంది.

# అదొక హత్యపరిణామం!

(మొదటిపేజీ తరువాయి)

సామాన్లు ఎందుకు తీసుకెళ్లారని భవానీని నిలదీయడం ప్రారంభించాడు. సామాన్లను కొయిరాల వద్ద ఇంట్లో పెట్టిన అనంతరం మద్యం సేవిస్తున్న ఎనిమిది మంది కలగజేసుకుని గోపీని రోడ్డుపైనే కర్రలతో కొడుతూ ఇంటి వెనుక వైపునకు ఈడ్చుకెళ్లి కర్రలు, ఇటుకలతో తలపై కొట్టి హత్య చేశారని వారు వివరించారు. ఈ కేసును ఎస్పీ పర్యవేక్షణలో జేఆర్‌పురం సీఐ అవతారం ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలు గాలింపు జరిపి నిందితులను అదుపులోకి తీసుకున్నాయన్నారు. గ్రామానికి చెందిన కొత్తకోట సూర్యనారాయణ, పైడి పెద్ది సత్యనారాయణ, కొత్తకోట ఈశ్వరరావు, కొత్తకోట రంగనాథం, సీపాన శివకృష్ణ, సీపాన అనిల్‌కుమార్, పైడి రంగరామానుజులు, గురుగుబెల్లి భవానీలను అదుపులోకి తీసుకున్నారు. మరికొందరి పాత్రపై విచారణ జరుగుతోందని చెప్పారు. వారి పాత్ర ఉందని తేలితే అరెస్టు చేస్తామన్నారు. నిందితులందరూ గోపీ బాధితులేనని తెలిపారు. అరెస్టయిన వారిలో ఇద్దరు రౌడీషీటర్లు ఉండగా, హతుడు సత్తారు గోపీపై ఎనిమిది క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. టెక్నికల్ ఎవిడెన్స్ (సాంకేతిక ఆధారాలు)తో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. హత్య జరిగిన చోట సీసీ కెమెరా ఉందన్నారు. దీనికి సంబంధించిన డీవీఆర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో సీఐ అవతారం, ఎస్సైలు సందీప్‌కుమార్, ఎస్.చిరంజీవి, జి.లక్ష్మణరావు, ఎస్.బాలరాజు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర ప్రతిఒక్కరి లక్ష్యం కావాలి

★ పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించగలగాలి
★ వ్యర్థాల తొలగింపునకు మెగాడ్రైవ్‌లు నిర్వహించండి
★ పరిశుభ్రమైన రాష్ట్రాల్లో నెంబర్ వన్‌గా ఆంధ్రప్రదేశ్‌ను నిలపాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం
★ శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
★ పీఎస్ఎన్ఎం స్కూల్‌లో పారిశుధ్య పనులు
★ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతపై అవగాహన









(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ప్రతిఒక్కరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని పీఎస్ఎన్ఎం స్కూల్ పరిసరాలలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ దేశంలోనే పరిశుభ్రమైన రాష్ట్రాల్లో నెంబర్ వన్‌గా ఆంధ్రప్రదేశ్‌ను నిలపాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే నెలలో మూడో శనివారం రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వివరించారు. నెలకి ఒకటి చొప్పున 12 నెలలకు 12 థీమ్‌లతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను అన్ని నివాసిత ప్రాంతాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు, ఆస్పత్రులు, బస్టాప్‌లు, రైల్వేస్టేషన్లు, పరిశ్రమలు తదితర ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో పరిశుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరు అంకితభావంతో భాగ్యస్వాములు కావాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం, పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడం, ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, పర్యాటకులు, యాత్రికులు, పెట్టుబడిదారులను ఆహ్వానించే రీతిలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, ఆర్థిక ప్రయోజనాలను మెరుగుపర్చడం, పిల్లలు, భవిష్యత్తుతరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం తదితర లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి రోడ్లు, చెత్తకుప్పలు, బోరుబావులు, కుంటలు, చెరువులు, కాలువల్లోని వ్యర్థాలను తొలగించడంతో పాటు మెగా శుభ్రత డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. అనంతరం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. స్కూల్ దరిలోని పండ్ల దుకాణదారులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. పాలిథిన్ కవర్లను వాడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్పొరేషన్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు, హెల్త్ ఆఫీసర్ సుధీర్, స్కూల్ హెచ్ఎం దేవదత్త, టీడీపీ నాయకులు, కార్యకర్తలు షాను, బుర్రి మధు, బలగ శివప్రసాద్, చంద్రమౌళి, ఈశ్వరరావు, టేకి అప్పలరాజు, రమణమాదిగ, కోటి, కుల్లాన శంకర్, సచివాలయ సిబ్బందితో పాటు మెప్మా సిబ్బంది, ఆర్పీలు, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులు అందుబాటులో ఉంచండి



✷ అందడం లేదని ఏ ఒక్కరైతు నుంచి ఫిర్యాదు రాకూడదు
✷ వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశించిన రాష్ట్ర మంత్రి

(సత్యంన్యూస్, టెక్కలి)

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని, రైతు సేవా కేంద్రాల్లో కూడా నిల్వలు ఉంచాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులకు ఆదేశించారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులు మంత్రిని శనివారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఏ ఒక్క రైతు నుంచి కూడా ఎరువులు అందలేదని ఫిర్యాదులు రాకూడదని ఆదేశించారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని మంత్రికి అధికారులు వివరించారు. శివారు ప్రాంత రైతులకు సాగునీరు అందించాలని, కాలువల్లో పూడికతీతలు వేగవంతం చేయాలని, చెరువుల్లో నీరు నిల్వ చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అవసరమైతే తాత్కాలిక సిబ్బందిని నియమించి కాలువల్లో పిచ్చిమొక్కలు తొలగించాలని సూచించారు. రైతులకు సాగునీటిలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అందుకు అవసరమైన ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఆర్.అప్పారావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి అచ్చెన్నాయుడు వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.



నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలనుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. అనంతరం వాటిని పరిష్కరించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. – సత్యంన్యూస్, టెక్కలి

# రైతుల పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల మాయం

(సత్యంన్యూస్, మందస)



మండలం లోని కొత్త కమలాపురం, బాలిగం గ్రామ సమీపంలో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ పైన ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు బొంగి వెంకయ్య, బొంగి సీతారాం, భావన సాంబమూర్తి, సేపాన నారాయణ, కొండియా నారాయణస్వామి ఉదయం పొలంకు వెళ్లిచూసేసరికి హైవేకు ఆనుకొని విద్యుత్తు కనెక్షన్లు కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి దాని లోపల ఉన్న రాగి కోయిల్, విలువైన సామాగ్రిని దోచుకున్నారు. వెంటనే మండల విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేయడంతో ఘటన స్థలానికి విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చి తనిఖీ చేశారు. రైతులు విద్యుత్ శాఖ వారిని సంప్రదించగా విద్యుత్ శాఖ ఏఈ ఎల్.యోగేశ్వరరావు తక్షణమే స్పందించి, పోలీసులకు రైతుల తరపున ఫిర్యాదు చేశారు. తక్షణం పోలీస్‌శాఖ అధికారులు స్పందించి దుండగులను శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి జరగకుండా చూసి, రైతులకు న్యాయం చేయాలని కోరారు. విద్యుత్ శాఖ వారు తక్షణం ట్రాన్స్‌ఫార్మర్‌ను తిరిగి పెట్టాలని, లేకుంటే పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని గమనించి తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్‌ను తిరిగి ఏర్పాటు చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి దొంగతనాలు జరగకుండా రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

# ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం




(సత్యంన్యూస్, సోంపేట)

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యంగా కృషి చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పిలుపు మేరకు శనివారం శ్రీకాకుళం జిల్లా పోలీసులు జిల్లాలోని అన్ని ఎస్డీపీఓ, సర్కిల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పోలీసులు శనివారం చేపట్టారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలలో చెత్తాచెదారం పిచ్చి మొక్కలు తొలగించడంతోపాటు పోలీస్ స్టేషన్లను శుభ్రం చేశారు. నెలలో మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని అన్ని పోలీస్ స్టేషన్లలో చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. దీంతో జిల్లాలోని అన్ని సర్కిల్, మరియు పోలీస్ స్టేషన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా ఈ కార్యక్రమం చేపట్టారు. పోలీసు స్టేషన్లు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, కలుపు మొక్కలు తొలగించి పచ్చని మొక్కలు నాటారు.

# ప్లాస్టిక్ రహిత సమాజం అందరి బాధ్యత

(సత్యంన్యూస్, రాజాం)

ప్లాస్టిక్ రహిత సమాజం అందరి బాధ్యతని ఇన్‌చార్జి ఎంపీడీఓ డి.నాగమణి అన్నారు. శనివారం మండలంలో స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్రలో భాగంగా అధికారులకు, సిబ్బందికి, క్లాప్‌మిత్రలకు ప్లాస్టిక్ వ్యర్థాల నివారణపై అవగాహన కల్పించారు. గుడ్డసంచులను వినియోగించడం ద్వారా ప్లాస్టిక్ నివారణ చేయవచ్చన్నారు. మండలంలో ప్రతీ గ్రామంలో ఇంటింటి నుండి పాడయిపోయిన ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్‌ను క్లాప్‌మిత్రల ద్వారా సేకరిస్తామని ఎంపీడీఓ తెలిపారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నివారణపై ప్రతిజ్ఞ, మానవహారం, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఐ.కృష్ణలత, ఎమ్ఈఓ ఎంవీ ప్రసాదరావు, మండల వ్యవసాయాధికారి బి.శ్రీనివాసరావు, జెఈ జి.శ్రీచరణ్, స్వచ్ఛ భారత్ మండల కో–ఆర్డినేటర్ పద్మ, ఏఈఓ విజయలక్ష్మి, ఈశ్వరరావు, ఉపాధి హామీ, వెలుగు, విద్యాశాఖ, మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి కామేశ్వరి కళ్యాణ మండపం సమీపంలో ఒక ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.46,970/–లు నగదు సీజ్ చేసినట్లు ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికంగా నివశిస్తున్న బోను గోవింద తన ఇంట్లో పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఇంట్లో పేకాట ఆడుతున్న బోను గోవిందతోపాటు బలగ ప్రసాద్, షేక్ కబీర్ ఆలీ, మచ్చ మోహనకృష్ణ, ముకర రాజశేఖర్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.



# సమస్యల పరిష్కారానికే "సుపరిపాలనలో తొలిఅడుగు"

(సత్యంన్యూస్, సారవకోట)

మండలంలోని కొత్తడ్డపనస పంచాయతీ గడ్డిపేట, వడ్డీనవలస, బుడితి, అలుదు, కుమ్మరిగుంట తదితర గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు క్లస్టర్–6 ఇంచార్జి, మండల టీడీపీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ అన్నారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గడ్డిపేటలో ఇంటింటికి కుళాయి సమస్య చెప్పారన్నారు. ఆ సమస్యని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామని హామీనిచ్చారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ చల్ల ఆనందరావు, బలగ భాస్కర్, ఇప్పిలి అశోక్‌కుమార్, బోర ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. శనివారం పాతినవారిపేటలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ప్రారంభించి ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్వర్యంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయడంలో భాగంగా ఆగస్టు 15వ తేది నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వివరించారు. చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం ఎన్టీఆర్ భరోసా ఫించన్లు మూడువేల నుంచి ఒకేసారి నాలుగు వేలకు పెంచి అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ముందుగా మోణింగవారి వీధిలో బిటి రహదారి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.39.9 లక్షలతో నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే ఐజె నాయుడు కాలనీ నుంచి సిఎస్పీ రోడ్ లక్ష్ముడిపేట వరకు బీటీ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీత, మున్సిపల్ కమిషనర్ టి.రవి, నాయకులు తమ్మినేని విద్యాసాగర్, మొదలవలస రమేష్, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.